
బానిస, సింహం



ఆండ్రోక్లెస్ ఒక బానిస. అతడు భీరువు, కానీ స్వేచ్ఛగా జీవించాలన్న కోరిక బలీయంగా ఉండేది. ఒక రోజు అతడు క్రూరుడైన యజమాని నుంచి తప్పించుకుని ఒక అడవిలోకి పారిపోయాడు.
అడవిలో గాయపడిన సింహం ఒకటి ఆండ్రోక్లెస్‌కి కనపించింది. అతడు మొదట భయపడిపోయాడు. కానీ ఆ అడవి జంతువు మీద ప్రేమతో తన భయాన్ని వదులుకుని సింహానికి సహాయపడ్డాడు.
ఆండ్రోక్లెస్, సింహం మధ్య స్నేహం పొటమరించింది. ఈ కథ ఎంతో ఆదరణ పొందింది. పాల్ గ్లాడెన్ అందమైన బొమ్మలు ఈ కథను మరింత ఆకర్షణీయంగా తీర్చి దిద్దాయి.




చాలా కాలం క్రితం రోమ్‌లో ఆండ్రోక్లెస్ అనే బానిస ఉండే వాడు.
అతడి యజమాని చాలా క్రూరుడు.
“నాకు స్వాతంత్రం కావాలి!" ఒక రోజు ఆండ్రోక్లెస్ తనలో తాను అనుకున్నాడు.
అందరూ నిద్రపోతున్న ఒక రాత్రి ఆండ్రోక్లెస్ తప్పించుకుని ఒక దట్టమైన అడవికి చేరుకున్నాడు.




ఆ అడవిలో అతడు చాలా సేపు తిరిగాడు.

అతడికి బాగా ఆకలిగా ఉంది.

ఉన్నట్టుండి అతడికి బాధతో
గర్జిస్తున్న ఒక సింహం
కనిపించింది.







సింహాన్ని చూసి ఆండ్రోక్లెస్ ముందు భయంతో పారిపోబోయాడు. అయితే
సింహం అక్కడి నుంచి కదలకపోవటం అతడు చూశాడు. అది ఎంతో
బాధలో ఉందని కూడా అతడికి అర్ధమయ్యింది. అతడు మెల్లగా సింహం
దగ్గరకు వచ్చాడు.

సింహం కుడి పంజా బాగా వాచి ఉండటం ఆండ్రోక్లెస్ చూశాడు.
అందులో ఒక పెద్ద ముల్లు లోపలికల్లా దిగబడి ఉంది. దాని
కారణంగానే సింహం బాధపడుతోంది.

ఆంద్రోక్లెస్ ముల్లును తాకగానే బాధతో సింహం పెద్దగా గర్జించింది.


భయంతో వణుకుతూనే ఆంద్రోక్లెస్ ఆ ముల్లును బయటకు లాగేశాడు.





తన పని అయిపోవటంతో ఆండ్రోక్లెస్ అక్కడి నుంచి వెళ్లిపోదామని అనుకున్నాడు. కానీ ఆ సింహం పెంపుడు కుక్క లాగా తోక ఊపుతూ స్నేహం ప్రకటించింది.

అది ఆండ్రోక్లెస్ వద్దకు వచ్చి అతడిని నాకింది. తనతో పాటు రమ్మన్నట్టుగా అతడిని మెల్లగా తోసింది.




కొంత సేపటికి ఆండ్రోక్లెస్, సింహమూ


ఒక గుహలోకి అడుగు పెట్టారు.

బాగా అలసిపోయి ఉన్న ఆండ్రోక్లెస్ ఆ గుహలోనే నిద్రపోయాడు. ఒక స్నేహితుడు, ఉండటానికి మంచి చోటు దొరకటంతో అతడు సంతోషంగా ఉన్నాడు. సింహం అతడి కోసం రోజూ మాంసం వేటాడి తెచ్చేది.

ఇద్దరూ సంతోషంగా రోజులు గడుపుతూ ఉండగా...









...సింహం వేటకి వెళ్ళినప్పుడు పారిపోయిన బానిసలను
వెతుకుతూ వచ్చిన సైనికులకు గుహలో నిద్రపోతున్న
ఆండ్రోక్లెస్ దొరికిపోయాడు.
వాళ్లు అతడిని బంధించి రాజు దగ్గరకు తీసుకుని వెళ్లారు.

ఆ రోజుల్లో పారిపోయిన బానిసలను సింహానికి ఆహారంగా వేసేవాళ్లు. బానిస, సింహం మధ్య పోరాటాన్ని వినోదంగా చూడటానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చేవాళ్లు.

ఆండ్రోక్లెస్‌ని సైనికులు ఒక చీకటి గదిలో ఉంచారు. అతడు తన చావు కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు.

ఒక భయంకరమైన సింహాన్ని బంధించిన సైనికులు దానిని ఆకలితో ఉంచారు. చీకటి గదిలో ఉన్న ఆండ్రోక్లెస్‌కి సింహం గర్జనలు వినపడుతున్నాయి. అది బాగా ఆకలిగా ఉందని అతడికి తెలుస్తూనే ఉంది.






చివరికి ఆ సమయం రానే వచ్చింది. ఆకాశంలో సూర్యుడు వెచ్చగా వెలుగుతున్నాడు. చీకటి గది నుంచి బయటకు వచ్చిన ఆండ్రోక్లెస్ కళ్లు వెలుతురికి బైర్లు కమ్మాయి. కళ్లు మూసుకునే అతడు ముందుకు నడిచాడు. అతడు భయంతో వణికిపోతున్నాడు.



సింహాసనంపై కూర్చున్న చక్రవర్తి నవ్వుతూ ఉన్నాడు. అతడు చెయ్యి పైకెత్తే సరికి అంతటా నిశ్శబ్దం అలుముకుంది.




బోను తలుపులు తెరవడంతో
సింహం గర్జిస్తూ బయటకు
పరుగులు తీసింది.

ఆండ్రోక్లెస్ భయంతో గడ్డకట్టుకుని పోయాడు. ఎక్కడా దాక్కోటానికి, ఎటూ పారిపోటానికి చోటు లేకపోవటంతో అతడు అక్కడే నిలబడిపోయాడు. సింహం గర్జిస్తూ అతడి వైపు వస్తోంది. “నా పని అయిపోయింది," అనుకున్నాడు ఆండ్రోక్లెస్. అతడు కళ్లు మూసుకుని తన చివరి క్షణాల కోసం వేచి ఉన్నాడు.




అయితే, ఉన్నట్టుండి సింహ గర్జన ఆగిపోయింది. సింహం పంజా ఆండ్రోక్లెస్‌ని చీరెయ్యలేదు, దాని కోరలు అతడి వంటిలో దిగబడలేదు. గరుకుగా, తడిగా ఉండే నాలుక అతడి వంటిని నాకుతోంది. అది అతడి స్నేహితుడైన సింహం.




“భలే!" ప్రజలు అరిచారు.


“అద్భుతం! బానిసను వదిలి
పెట్టండి! సింహాన్ని
వదిలిపెట్టండి!"



చక్రవర్తి కూడా ఆశ్చర్యపోయాడు. ఆండ్రోక్లెస్‌ని
తన ముందుకు పిలిపించుకుని అతడి కథ
విన్నాడు.

అడవిలో జరిగినదంతా ఆండ్రోక్లెస్ చెప్పాడు.
బానిసనీ, అతడి స్నేహితుడైన సింహాన్ని
స్వేచ్ఛగా వదిలెయ్యాలని చక్రవర్తి
నిర్ణయించాడు.





ఆ ఇద్దరూ అడవి వైపు నడుచుకుంటూ వెళ్లారు.